క్లుప్తంగా

బాలినేనిని కలిసిన మేయర్, కార్పొరేటర్లు



బాలినేనిని సన్మానిస్తున్న మేయర్ గంగాడ సుజాత, కార్పొరేటర్లు

ఒంగోలు: స్టడీ టూర్‌లో భాగంగా దేశవ్యాప్తంగా పలు ప్రాంతాలను సందర్శించి వచ్చిన నగరపాలక సంస్థ కార్పొరేటర్లు శనివారం మేయర్ గంగాడ సుజాతతో కలిసి స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. విజయవంతంగా సాగిన విజ్ఞాన యాత్ర వివరాలను బాలినేనికి తెలియజేశారు. ఈ సందర్భంగా అమృతసర్ నుంచి తీసుకొచ్చిన స్వర్ణ దేవాలయం ప్రతిమను, శాలువాను బాలినేనికి బహూకరించి సన్మానించారు. టూర్‌కు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

బధిరుల పాఠశాలలో దరఖాస్తుల ఆహ్వానం

చీమకుర్తి: చీమకుర్తిలోని ఎస్‌కేఆర్ మానసిక వికాస కేంద్రానికి చెందిన బధిరుల పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి అర్హత కలిగిన విద్యార్థులను చేర్చుకునేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.ఆంజనేయులరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 10వ తరగతి వరకు బాలబాలికలకు వేరువేరుగా హాస్టల్ వసతితో పాటు ఉచిత విద్య అందించనున్నట్లు చెప్పారు. పాఠశాలలో చేరిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణతో పాటు దివ్యాంగులకు సాంకేతిక పరికరాలతో నైపుణ్యం కలిగిన టీచర్లతో బోధన అందిస్తామన్నారు. రాష్ట్రంలోని ఏ జిల్లాకు చెందిన విద్యార్థులైనా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులను పూర్తి వివరాలతో వైట్ పేపర్‌పై రాసి చీమకుర్తిలోని ఆర్టీసీ బస్టాండ్ వెనుక ఉన్న బధిరుల పాఠశాలలో అందించాలని, పూర్తి వివరాలకు ఫోన్ నంబర్ 95050 60361ను సంప్రదించాలని సూచించారు.



రైతు భరోసా కేంద్రం



ధాన్యం కొనుగోలు చేస్తున్న ఆర్‌బీకే సిబ్బంది

రైతు నేస్తాలు.. ఆర్‌బీకేలు

- రైతు భరోసా కేంద్రాల ద్వారా వ్యవసాయానికి విస్తృత సేవలు
- కొత్తపట్నం మండలంలో 15 ఆర్‌బీకేలతో 11 వేల మంది రైతులకు మేలు
- పంటల సాగు మొదలు.. మార్కెటింగ్ వరకూ ఆర్‌బీకేల ద్వారానే అమలు
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

కొత్తపట్నం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బీకేలు) రైతులకు సకలం సమకూరుస్తూ ఎంతో ఉపయోగపడుతున్నాయి. వ్యవసాయం చేసేందుకు అవసరమైన సేవలన్నీ అన్నదాత ఇంటి ముందుకే వస్తున్నాయి. గ్రామం మధ్యలోనే ఆర్‌బీకేలు ఏర్పాటు చేయడం వలన రైతులు వారికి అవసరమైన పనులన్నింటినీ సులభంగా చేయించుకుంటున్నారు. ఆర్‌బీకేలలోని కియోస్క్ మిషన్ ద్వారా అవసరమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను రిజిస్ట్రేషన్ చేయించుకుని పొందుతున్నారు. తక్కువ ధరలకే నాణ్యమైన వాటిని సకాలంలో ప్రభుత్వం సరఫరా చేస్తుండటంతో అన్నదాతలు ఆనందంగా వ్యవసాయం చేస్తున్నారు. గ్రామంలో పండించే ధాన్యాన్ని కూడా ఆర్‌బీకేల ద్వారానే కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో నగదు జమచేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలు వచ్చి పంట నష్టపోతే వెంటనే నష్టం అంచనాలు వేయించి పరిహారాన్ని బాధిత రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేస్తున్నారు. రైతులు గతంలో మాదిరిగా మోసపోకుండా నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయడంలో ఆర్‌బీకేలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. నెలలో మూడో శుక్రవారం ఆర్‌బీకేలలో సాంకేతిక పరిజ్ఞానం, కొత్త కొత్త విషయాలతో కూడిన సమావేశం ఏర్పాటు చేసి రైతులతో చర్చిస్తారు. ఆర్‌బీకేలలో టీవీలు ఏర్పాటు చేసి వ్యవసాయంలో విదేశీ ఆధునిక పరిజ్ఞానంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు వ్యవసాయం దండగ అంటే.. ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయం పండుగ అని ఆర్‌బీకేల ద్వారా నిరూపించడంతో రైతులంతా ఆనందంగా పంటలు పండిస్తున్నారు. కొత్తపట్నం మండలంలో 15 రైతు భరోసా కేంద్రాలు ఉండగా, వాటి ద్వారా 77 రకాల సేవలను రైతులకు అందిస్తున్నారు. 11 వేల మంది రైతులు ఆర్‌బీకేల ద్వారా సేవలు పొందుతున్నారు. వ్యవసాయ అనుబంధ సంస్థలకు చెందిన 16 రకాల సేవలు అందిస్తున్నారు. ఉద్యానవనశాఖకు చెందిన 12 రకాల సేవలు, పశుసంవర్ధక శాఖకు చెందిన 21 రకాల సేవలు, మత్స్యశాఖకు సంబంధించి 11, వ్యవసాయ, మార్కెటింగ్ 5, సివిల్ సప్లయర్స్‌కు సంబంధించి ఒక సేవను అందిస్తున్నారు.

ఆర్‌బీకేల ద్వారా ప్రతి సేవనూ రైతుకు అందిస్తున్నాం :



రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఉపయోగపడే 77 రకాల సేవలను ఆర్‌బీకేల ద్వారా అందిస్తోంది. అనుబంధ శాఖలైన ఉద్యానవన, పశుసంవర్ధకశాఖ, మత్స్యశాఖ, వ్యవసాయ మార్కెటింగ్, సివిల్ సప్లయర్స్ సేవలు అందిస్తున్నారు. ప్రతి నెలా మూడో శుక్రవారం ఆర్‌బీకేల ద్వారా సమావేశాలు ఏర్పాటు చేసి రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్నారు. రైతుకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సకాలంలో సరఫరా చేస్తున్నాం.

మోహన్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి, కొత్తపట్నం

అధిక ధర వచ్చింది :



నేను పండించిన ధాన్యాన్ని ఆర్‌బీకే ద్వారా విక్రయిస్తే ధర ఎక్కువగా చెల్లించారు. క్వింటా వరిని ఆర్‌బీకే ద్వారా విక్రయిస్తే రూ.2,060 ధర చెల్లించారు. ప్రైవేటు వ్యాపారులు రూ.1,400కు మాత్రమే కొనుగోలు చేశారు. క్వింటాకు రూ.660 అదనంగా చెల్లించడం ఎంతో ఆనందంగా ఉంది. నేను 10 టన్నుల వరి ధాన్యాన్ని ఆర్‌బీకేల ద్వారా అమ్ముకున్నాను.

పిరకాల సుబ్బారెడ్డి, రైతు, అల్లూరు

సకాలంలో ఎరువులు, విత్తనాలు ఇస్తున్నారు :



ఆర్‌బీకేల ద్వారా ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు సకాలంలో ఇస్తున్నారు. నాణ్యమైన వాటిని తక్కువ ధరలకు ఆన్‌లైన్ చేసి అందిస్తుండటంతో రైతు మోసపోకుండా ఉంటున్నాడు. ఆర్‌బీకేలు వచ్చిన తర్వాత దళారీ వ్యవస్థ కనుమరుగైంది. ఆర్‌బీకేలతో రైతులకు ఎంతో లాభం చేకూరుతోంది.

పిట్టు వెంకటేశ్వర్లు, రైతు, వజ్జిరెడ్డిపాలెం

బూచేపల్లి కమలాకర్‌కు ఘన నివాళి



కమలాకర్‌రెడ్డికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి, ఎమ్మెల్యే టీజేఆర్, తదితరులు

చీమకుర్తి: సినీ హీరో బూచేపల్లి కమలాకర్‌రెడ్డికి కుటుంబ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. శనివారం కమలాకర్‌రెడ్డి జయంతి సందర్భంగా తల్లి అయిన జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, సోదరుడు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, నందిని దంపతులు, ఇతర కుటుంబ సభ్యులతో పాటు సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు చీమకుర్తిలోని కమలాకర్‌రెడ్డి ఘాట్ వద్ద పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. అక్కడే కేక్ కట్ చేశారు. అనంతరం చీమకుర్తిలోని ప్రైవేటు ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కమలాకర్‌రెడ్డి సినీ జీవితం, ఇతర మధురస్మృతులను గుర్తుచేసుకున్నారు. నివాళులర్పించిన వారిలో వైఎస్సార్ సీపీ చీమకుర్తి పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

ఒంగోలు టౌన్: నగరంలో ఇళ్లు లేని నిరుపేదలకు వెంటనే టిడ్కో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి అందించాలని సీపీఎం నగర కమిటీ కార్యదర్శి జి.రమేష్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సుందరయ్య భవన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో తొలి విడత 4 వేల టిడ్కో ఇళ్లను త్వరితగతిన పూర్తిచేసి అందజేయాలని, ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన నిధులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జగనన్న కాలనీల కోసం అగ్రహారం వద్ద సేకరించిన 250 ఎకరాల స్థలంలో మౌలిక సదుపాయాలు కల్పించి వెంటనే అర్హులైన లబ్ధిదారులకు అందజేయాలని కోరారు. ప్రతి ఒక్కరికీ రెండు సెంట్ల స్థలం ఇవ్వాలని, ఇళ్ల స్థలాల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

బహిరంగ ప్రకటన

మా క్లయింట్లు అయిన ప్రకాశం జిల్లా, చీమకుర్తి మండలం, చీమకుర్తి గ్రామం, డోరునెం.5-107రు నివాసం, కోటకట్లవారి వీధి, శ్రీ శిద్దా పాండురంగారావు గారి కుమార్లు శ్రీ శిద్దా వెంకట సురేష్ కుమార్ మరియు శ్రీ శిద్దా వెంకట బాల సుబ్రమణ్యం, అనువార్లు మాకు యిచ్చిన సూచనలు మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా...

క్రింది షెడ్యూలు దాఖలాస్తిని శ్రీమతి రావిపూడి కోటేశ్వరమ్మ గారి వద్ద నుండి తే.21-06-1974దిన గుండ్లాపల్లి కాపురస్తుడు శ్రీ అద్దాల వెంకట్రాయుడు గారి కుమారుడు అంజయ్య గారు, కొనుగోలు చేసి అద్దంకి స.రి. వారి ఆఫీసులో దస్తావేజు నెం.1296/1974రుగా రిజిష్టరు పొంది, హక్కు సంక్రమించి, ఆయన స్వాధీనానుభవములో కలిగి నిర్వివాదముగా అనుభవించుచు, సదరాస్తిని గురించి ఎట్టి వ్రాతలు వ్రాయకుండా సదరు అంజయ్య గారు మరియు ఆయన భార్య నారాయణమ్మ గారు మరణించిన దరిమిలా, వారసత్వరూపేణా వారి సంతానము అయిన శ్రీ వెంకట రామారావు, శ్రీ శ్రీనివాసరావు, మరియు శ్రీ సుబ్బారావు గార్లకు సంక్రమించి, వారి స్వాధీనానుభవములో కలిగి, నిర్వివాదముగా అనుభవించుచు, క్రింది షెడ్యూలు దాఖలాస్తిని మా క్లయింట్లుకు విక్రయించుటకు ఖరారుపడి యున్నారు. కనుక క్రింది షెడ్యూలు దాఖలాస్తిపై ఎవ్వరికైనను ఎటువంటి హక్కులుగాని, అభ్యంతరములు గాని, ఆక్షేపణలు గాని, అగ్రిమెంట్లు గాని, తాకట్లుగాని ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన పది (10) రోజులు లోపల వ్రాతపూర్వకమైన ఆధారములతో క్రింది అడ్రసుకు తెలియపరచవలెను. లేనియెడల సదరాస్తి నిర్వివాదమైన ఆస్తియని ధృవపరచుకొని మా క్లయింట్లు వారి పేరుతో గాని, వారి స్థానీయుల పేరుతో గాని విక్రయపత్రం పొందగలరు. దరిమిలా సదరాస్తిపై ఎటువంటి ఆక్షేపణలు వచ్చిన యెడల అట్టివి చెల్లనేరవు మరియు మా క్లయింట్లు హక్కులను బద్ధపరచజాలవు అని యిందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూలు : ప్రకాశం జిల్లా – మద్దిపాడు మండలం – గుండ్లాపల్లి గ్రామం – సర్వే నెం.211/1బిరు సబ్‌డివిజన్ కాబడిన దరిమిలా సర్వే నెం.211/1బి2రులో య.0.89సెంట్లు భూమికి హద్దులు: **తూర్పు:** పల్లకి వెంకట సుబ్బారెడ్డి గారి భూమి, **దక్షిణం:** నలమాలపు కోటిరెడ్డి భూమి, **పడమర:** తుమ్మల చిన వెంకయ్య భూమి, **ఉత్తరం:** అద్దాల హనుమయ్య భూమి.

స్థలం : ఒంగోలు
తేది: 17-06-2023

బొద్దు రామలింగం, బోడపాటి శ్రీనివాసరావు
అడ్వకేట్స్, ఒంగోలు. సెల్: 9866588599

పేదలకు ప్రభుత్వ పథకాలు చేరువ చేయాలి

- డీఆర్‌డీఏ సిబ్బంది సమర్థవంతంగా పనిచేయాలి
- డీఆర్‌డీఏ సమీక్షలో పీడీ బాబూరావు



సమీక్షిస్తున్న పీడీ బాబూరావు

ఒంగోలు సబర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను పేదలకు చేరువ చేయాలని డీఆర్‌డీఏ పీడీ బి.బాబూరావు సిబ్బందిని ఆదేశించారు. స్థానిక టీటీడీసీ ప్రాంగణంలో ఒంగోలు, సంతనూతలపాడు నియోజకవర్గాల సిబ్బందితో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పనిచేసే వీవోఏలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పేదలకు ప్రభుత్వ పథకాలు అందించేందుకు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. అర్హత ఉన్న ఎస్సీ, ఎస్టీలకు రుణాలందించాలన్నారు. రుణాల మంజూరులో డబ్బుల వసూళ్లకు పాల్పడితే ఉద్యోగం నుంచి తీసివేయడమే కాకుండా క్రిమినల్ చర్యలు కూడా తీసుకుంటామని హెచ్చరించారు. సీఐఎఫ్, స్త్రీనిధి, పీఎంఈజీపీ బ్యాంకు రుణాల మంజూరులో కచ్చితంగా 50 శాతం ఎస్సీ, ఎస్టీలు ఉండేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. బ్యాంకులకు రుణాల వసూళ్లలో 100 శాతం సహకరించాలని ఆదేశించారు. రుణాలు పొందిన ఎస్‌హెచ్‌జీలు తిరిగి నేరుగా బ్యాంకు అకౌంట్లకు ఈఎంఐలు జమ చేసుకోవాలని సూచించారు. వారి తరఫున వీవోఏలు జమ చేయకూడదన్నారు. వీవోఏలు మొబైల్ బుక్ కీపింగ్ నమోదు చేసి అన్ని సంఘాలు ఏ గ్రేడ్‌లో ఉండే విధంగా చూడాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వ ప్రాధాన్యతా అంశాలైన గృహ నిర్మాణం, జగనన్న పాలవెల్లువ, జగనన్న తోడు వంటి వాటిపై ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఎంలు, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

24 నుంచి జగనన్న సురక్ష సేవలు

ఒంగోలు రూరల్: జగనన్న సురక్ష సేవల కార్యక్రమం ఈ నెల 24వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని ఒంగోలు ఎంపీడీవో పి.అజిత తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జూన్ 23వ తేదీ లాంఛనంగా జగనన్న సురక్ష సేవలు ప్రారంభించిన తర్వాత 24 నుంచి క్షేత్రస్థాయిలో ప్రారంభం కానున్నట్లు చెప్పారు. జూన్ 24 నుంచి 30వ తేదీ వరకు ప్రతి వాలంటీర్ వారికి సంబంధించిన 50 గృహాలను సందర్శించి అర్హులై ఉండి కూడా ప్రభుత్వ పథకాలు వర్తించని వారిని గుర్తించి ఆ వివరాలను 30వ తేదీ అందజేయాలని సూచించారు. వాటిలో 9 రకాల సేవలు ఉంటాయన్నారు. కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ, జనన, మరణ, వివాహ ధ్రువీకరణ పత్రాలతో పాటు మ్యుటేషన్ సర్వీస్, ఫ్యామిలీ మెంబర్ ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డుకు ఫోన్ నంబర్ లింకేజ్, కౌలురైతు కార్డు వంటి సేవలు మొదటి ప్రాధాన్యత క్రమంలో ఉంటాయని ఎంపీడీవో తెలిపారు. అనంతరం జూలై 1 నుంచి నాలుగు వారాలపాటు మండలస్థాయి అధికారుల బృందం గ్రామాల్లోని సచివాలయాన్ని సందర్శించనుందని తెలిపారు. ఈ టీంలో తహసీల్దార్, ఎంపీడీవో, డిప్యూటీ తహసీల్దార్, ఏపీఎం, ఏపీవోతో పాటు మండలస్థాయి అధికారులందరూ పాల్గొంటారన్నారు. అనంతరం వారు నిర్ధారించి తయారుచేసిన ధ్రువీకరణ పత్రాలను ఒక్కరోజు స్థానిక ఎమ్మెల్యే, ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఆయా గ్రామాల నాయకులతో కలిసి లబ్ధిదారులకు స్వయంగా అందజేయడం జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు.

మెరిసిన పుల్లలచెరువు కేజీబీవీ ఆణిముత్యం



బాలినేని, ఆదిమూలపు, కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న విద్యార్థిని డెలోరిస్

పుల్లలచెరువు: జిల్లాలోనే మారుమూల ప్రాంతంలోని కేజీబీవీ పాఠశాల ఇంటర్ విద్యార్థి ఆణిముత్యమై మెరిసింది. శనివారం జిల్లా కేంద్రంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాలలో ఇంటర్‌లో మంచి మార్కులు వచ్చిన వారిని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మట్టిలో ఆణిముత్యాలు కార్యక్రమం ద్వారా జిల్లా అధికారులు అభినందన సభ ఏర్పాటు చేశారు. అందులో భాగంగా పుల్లలచెరువు కేజీబీవీ విద్యార్థిని బి.డెలోరిస్ బైపీసీలో 907 మార్కులతో మొదటి ర్యాంక్ సాధించింది. కలెక్టర్ దినేష్‌కుమార్, రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా రూ.50 వేల నగదు, జ్ఞాపిక, ప్రశంస పత్రం అందుకుంది. కాలేజీ ప్రిన్సిపాల్ లిల్లీ ప్రకాశ్‌వాణి, ఉపాధ్యాయులను కలెక్టర్, మంత్రి సురేష్‌లు ఘనంగా సన్మానించారు.

ఏకలవ్య విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు

పెద్దదోర్నాల: జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ కాలేజీ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించి అవార్డులు అందుకున్నారు. ఇందులో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఏకలవ్య కాలేజీకి చెందిన బైపీసీ విద్యార్థి అంబికాబాయి, ఎంపీసీ విద్యార్థి క్రిష్ణశ్రీబాయి, సీఈసీ విద్యార్థిని శిరీష ఇంటర్మీడియట్‌లో మెరుగైన ఫలితాలు సాధించిన నేపథ్యంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ దినేష్‌కుమార్, జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. ప్రిన్సిపాల్ శ్యామ్యేల్ జోబ్, తల్లిదండ్రులను సైతం సన్మానించారు.



మెడల్స్, సర్టిఫికెట్లతో విద్యార్థులు

జగనన్న ఆణిముత్యాలకు బహుమతులు

మార్కాపురం టౌన్: పట్టణంలోని పూలసుబ్బయ్య కాలనీలోని మున్సిపల్ హైస్కూల్‌లో గత ఏడాది 10వ తరగతిలో ప్రతిభచూపిన విద్యార్థులకు శనివారం మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. పాఠశాలకు చెందిన పి.జాహ్నవి 600కు గాను 493, షేక్ మహీరా 423, షేక్ అబ్దుల్ వాహీద్ 421 మార్కులు సాధింటంతో వారికి మెడల్స్, సర్టిఫికెట్‌లను అందజేశారు. హెచ్‌ఎం రవికుమార్, కౌన్సిలర్ షెక్షావలి, పీఎంసీ చైర్మన్ కరీముల్లా, నాయకులు ఉస్మాన్, ఉపాధ్యాయులు కె.వెంకటేశ్వరరావు, గంగాభవానీ, శ్రీనివాసరెడ్డి, ఆదిలక్ష్మి, నూర్జహాన్, సుబ్బారావు, నూర్ అహమ్మద్ పాల్గొన్నారు.

ప్రజాసంఘాల నేతలపై కేసులు ఎత్తివేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పద్మ

ఒంగోలు టౌన్: ప్రొఫెసర్ హరగోపాల్, ప్రగతిశీల మహిళా సంఘ జాతీయ కన్వీనర్ వి.సంధ్యతో పాటుగా 150 మందిపై పెట్టిన ఉపా కేసులను వెంటనే ఎత్తివేయాలని పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.పద్మ డిమాండ్ చేశారు. శనివారం ఒంగోలులోని మాదాల నారాయణస్వామి భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పీడిత ప్రజల కోసం పోరాడుతున్న, అణచివేతకు గురవుతున్న మహిళల సాధికారిత కోసం 40 ఏళ్లుగా పోరాడుతున్న సంధ్యపై ఉపా కేసు బనాయించడం దారుణమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై అవిశ్రాంతంగా పోరాడుతున్న సంధ్య తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలోనూ రాష్ట్రం మొత్తం తిరిగి మహిళలను చైతన్యం చేశారని తెలిపారు. ఆమెపై కేసు పెట్టడం కేసీఆర్ ప్రజా వ్యతిరేక విధానాలకు నిదర్శనమని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పనిచేసిన 50 మంది మేధావులపై కేసులు బనాయించడం ప్రశ్నించే గొంతులను అణచివేయడమే అని మండిపడ్డారు. మేధావులపై బనాయించిన ఉపా కేసులను వెంటనే ఎత్తివేయాలని, ఉపా చట్టాన్ని రద్దు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.భారతి, వి.మంజుల, జిల్లా నాయకులు సీహెచ్ పద్మజ, ఎన్.వేణి రవీంద్ర, ఎల్.మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

578 పొగాకు బేళ్ల కొనుగోలు

ఒంగోలు రూరల్: స్థానిక ఒంగోలు పొగాకు వేలం కేంద్రం–2లో శనివారం 607 బేళ్లు వేలానికి రాగా 578 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణ అధికారి కె.రామకృష్ణ తెలిపారు. 7 బేళ్లు నోబిడ్ అవగా, కేజీ గరిష్ట ధర రూ.246, కనిష్ట ధర రూ.160, సరాసరి ధర రూ.236.37గా నమోదైనట్లు వివరించారు.

ఆటోడ్రైవర్ కుటుంబానికి సరుకుల అందజేత



సరుకులు అందజేస్తున్న సూర్యశ్రీ ట్రస్ట్ సభ్యులు

ఒంగోలు అర్బన్: రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయిన ఆటోడ్రైవర్ సుధాకర్ కుటుంబానికి సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేసింది. శనివారం ట్రస్ట్ సభ్యులు స్థానిక గణపతినగర్‌లో ఆటో డ్రైవర్ ఇంటి వద్దకు వెళ్లి దాతల సహకారంతో సరుకులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సర్దార్ బాషా, మండవ సుబ్బారావు, మారెళ్ల సుబ్బారావు, నేరెళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేత

చీమకుర్తి: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతుల దృష్ట్యా ఆదివారం చీమకుర్తి పట్టణంతో పాటు గోనుగుంట, కేవీ పాలెం, పిడతలపూడి, రామచంద్రాపురం, జీఎల్ పురం, ఏలూరివారిపాలెం, మర్రిపాలెం గ్రామాల్లో కరెంటు సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కరెంటు సరఫరాను నిలిపివేస్తున్నందున వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

వలంటీర్లకు సేవా పురస్కారాలు



వలంటీర్లను సత్కరిస్తున్న దుంపా చెంచిరెడ్డి

చీమకుర్తి: సంతనూతలపాడు మండలం మైనంపాడు గ్రామంలో వలంటీర్లకు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి చేతుల మీదుగా సేవా పురస్కారాలు అందించారు. శనివారం మైనంపాడు గ్రామంలో 28 మంది వలంటీర్లకు శాలువాలు కప్పి వారి సేవలను అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ డీ రమణ, ఎంపీటీసీ సభ్యురాలు ఏ రాజకుమారి, వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు జీ సుబ్బారావు, బసుమస్తాన్, సచివాలయ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

అంకాలమ్మా దీవించమ్మా!

కొనకనమిట్ల: అంకాలమ్మా దీవించమ్మా అంటూ మండల కేంద్రం కొనకనమిట్లలో పురాతన ఆలయం అంకాలేశ్వరి ఆలయంలో శనివారం భక్తులు వేడుకున్నారు. అంకాలమ్మ తల్లి జాతరను జాతరను పురస్కరించుకొని పసుపు, కుంకుమ, చీర, జాకెట్‌లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ తరఫున రెండు, టీడీపీ తరఫున ఒకటి, మరో మొక్కుబడి ప్రభ ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి కుంకుమ బండ్లు, గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. సీఐ రాఘవేంద్ర ఆధ్వర్యంలో ఎస్‌ఐ దీపిక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.